
విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తున్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కు నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
99492 22450
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
23-2-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 173

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# గాంధీ విగ్రహంపై వెనకడుగు?

మూసీ ప్రాజెక్టులో భాగంగా రూ.5 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన గాంధీ విగ్రహం నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. శనివారం బండ్లగూడ జాగీర్ వార్డ్ ఆఫీసులో జరగాల్సిన భూసేకరణ సమావేశాన్ని వాయిదా వేసింది. గాంధీ సరోవర్ పేరిట గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున భూమిని సేకరించాలన్న నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించడం వల్లే సర్కారు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది.

2లో

## భూసేకరణ నిర్ణయం వాయిదా

- ప్రజల నుంచి నిరసన రావడం వల్లే?
- తమ భూములు ఇవ్వబోమంటున్న యజమానులు
- ప్రభుత్వ భూములను విక్రయించిన ధరనే
- తమకూ ఇవ్వాలని డిమాండ్

దేశంలోనే ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన రేవంత్ సర్కారు.. ఇందుకోసం రూ.5వేల కోట్లు వెచ్చించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకని డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు కాకున్నా.. ఏషియన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు రుణం మంజూరు చేయకున్నా

(ప్రభాత సూర్య, తెలంగాణ బ్యూరో)



## స్నేహితుడే సూత్రధారి!

- రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసును ఛేదించిన పోలీసులు
- ఆర్థిక వివాదాలతో స్నేహితుడే కిరాయి ఇచ్చి హత్య చేయించినట్టు నిర్ధారణ
- ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంతో కారును పాలేరు జలాశయంలోకి తోసివేత
- ప్రధాన నిందితుడైన స్నేహితుడితో పాటు ముగ్గురు కిరాయి హంతకుల అరెస్ట్

2లో

# హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

## తెలంగాణ ప్రయోజనాలపై రాజీపడేది లేదన్న సీఎం రేవంత్

**నీటి సమస్యలపై అసెంబ్లీలో చర్చకు రావాలని కేసీఆర్‌కు సూచన**

**కాళేశ్వరం ప్రాజెక్టును వృథాగా పోనివ్వమని స్పష్టం**

**రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ**

**దేవాదుల భూసేకరణకు రూ. 600 కోట్లు కేటాయిస్తామని ప్రకటన**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నదీ జలాలను మళ్లించేందుకు తాను మద్దతిస్తున్నానంటూ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. ఆదివారం ములుగు జిల్లాలో దేవాదుల ప్రాజెక్టుపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. నీటి సమస్యలపై చౌకబారు ఆరోపణలు చేస్తూ ప్రజలకు సంబంధించిన అంశాలను రాజకీయం చేయవద్దని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. అవసరమైతే తాము పొరుగు రాష్ట్రాలతో చర్చిస్తామని, కానీ తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేయబోమని అన్నారు. గోదావరి జలాల అంశంపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కేసీఆర్, హరీశ్ రావు తమ విలువైన సలహాలు ఇవ్వాలని సూచించారు.



2లో



## ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

- ఏఐ రంగంలో భారత్ అద్భుత విజయాలు
- వాటిని చూసి అధినేతలు ఆశ్చర్యపోయారు
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

# లొంగిపోయిన దేవ్‌జీ!

**రాజిరెడ్డి సహా 16 మందితో కలిసి ఆయుధాలు వీడిన మావో అగ్రనేత**

**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగుబాటు**

**దీనిపై తమకు సమాచారం ఉందన్న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం**

**ఇంకా ధ్రువీకరించని తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు..**

**కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ లక్ష్యం ఇక నెరవేరినట్లేనని చర్చ**





కోరుట్ల: మావోయిస్టు పార్టీ అగ్రనేత, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఎట్టకేలకు అజ్ఞాతం వీడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగిపోయారని విశ్వసనీయ సమాచారం. ఆయనతోపాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సహా 16 మంది సహచరులు లొంగిపోయినట్లు తెలిసింది.

2లో



## జమ్మూలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు టెర్రరిస్టులు హతం

జమ్మూకశ్మీర్‌లోని కిష్వార్త జిల్లాలోని మారుమూల ప్రాంతంలో భద్రతా బలగాలకు తీవ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. సైన్యం జరిపిన కౌంటర్ టెర్రర్ ఆపరేషన్‌లో ముగ్గుర ఉగ్రవాదులు హతమయినట్లు తెలుస్తోంది. జమ్మూలోని. మృతిచెందిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రసంస్థతో సంబంధం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే మృతిచెందిన ఉగ్రవాదుల నుండి ఏకే-47 రైఫిల్స్‌తో పాటు మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

2లో



2లో

## ఉద్రిక్తంగా 'చలో కామారెడ్డి'

- రాంచందర్‌రావును అరెస్టు చేస్తున్న పోలీసులు
- బీజేపీ ముఖ్యనేతల ఇళ్ల వద్ద పోలీసుల మోహరింపు
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అరెస్టు... బొల్లారం పీఎస్‌కు తరలింపు
- పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల హౌస్ అరెస్టు
- పోలీసులు, ప్రభుత్వ వైఖరిపై కమలనాథుల ఆగ్రహం



# గాంధీ విగ్రహంపై వెనకడుగు?

(మొదటి పేజీ తరువాయి)

(మొదటి పేజీ తరువాయి)

హడావిడిగా గాంధీ విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్ సిద్ధమవుతున్నారు. మూసీ నది ఒడ్డున రూ. 5 వేల కోట్లతో దేశంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం నిర్మాణానికి ఫిబ్రవరి నెలలోనే శంకుస్థాపన చేయాలని భావిస్తున్నా రు. గాంధీ విగ్రహం కోసం.. ఈసీ, మూసీ నదుల సంగమంలోని10 ఎకరాల భూసేకరణకు ఫిబ్రవరి 19 గురువారం తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం 3,279 ఎకరాలు, 10,017 ఇండ్లు, షాపులు సేకరించనున్నారు. మూసీ పునరుజ్జీవం పేరిట హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, బుద్వేల్, కిస్మత్‌పూర్, బండ్లగూడ, హైదర్‌షాకోట్, మధుపార్క్ తదితర ప్రాంతాల నుంచి భూమిని సేకరించేందుకు ప్రభుత్వం సంబంధిత భూముల సర్వే నంబర్లతో నోటిఫికేషన్ జారీ చేసింది. గాంధీ సరోవర్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఎకో ప్రాజెక్ట్ అభివృద్ధి పేరిట భూ సేకరణ కోసం గ్రామ రెవెన్యూ అధికారులు గురువారం హైదర్‌గూడ, కిస్మత్‌పూర్‌లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలకు ఇంటి స్థలాల యజమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**500 కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం..**

నోటిఫికేషన్ ఇచ్చిన భూమిలో మధు పార్క్ రిడ్జ్ అపార్టుమెంట్ కాంప్లెక్స్ ఉంది. ఇందులో నివసించే సుమారు 500 కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. దీంతో ప్రభుత్వ నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యరేకిస్తున్నారు. మూసీ నది అభివృద్ధి పేరిట ఇండ్లను కూలుస్తామంటే ప్రాణాలు పోయినా ఇంటి స్థలాలను ఇవ్వబోమని పరీవాహక ప్రాంత ప్రజలు తేల్చి చెబుతున్నారు. గాంధీ సరోవర్ పేరిట తమ ఇంటి స్థలాలను లాక్కొంటే చూస్తూ ఊరుకోబోమన్నారు.అంతే కాకుండా.. మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని వేలాదిమందిని నిరాశ్రయులను చేస్తోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అయినా.. మూసీ నది ఒడ్డున భారీ గాంధీ విగ్రహం పెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే.. ప్రజలు, ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు, రాజకీయ పార్టీల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయినా సరే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో ముందుకే పోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. దీంతో, 'ప్రభుత్వ భూములను వందల కోట్లకు విక్రయిస్తూ మా భూములను మాత్రం నామమాత్రపు ధరలకు తీసుకుంటామంటే సహించబోం. మా భూములను కూడా అదే తరహాలో కొనుగోలు చేయాలి' అని బాధితులు అంటున్నారు. ఇండ్లను కోల్పోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఏకంగా గ్రామసభలు పెట్టి అధికారులు వారికి అనుకూలంగా తీర్మానాలు చేసుకొని.. తమ స్థలాలను లాక్కోనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూసేకరణ నోటీసులు ఇచ్చిన వెంటనే గ్రామసభలు పెట్టడమేంటని నిలదీస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం రూ.5000 కోట్లు తగలెయ్యడం అవసరమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు

## ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ సాధించిన విజయాలు చూసి ప్రపంచ దేశాల అధినేతలు ఆశ్చర్యపోయారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సును కీలక టర్నింగ్ పాయింట్‌గా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని ఎలా వినియోగించుకోవాలో దిశా నిర్దేశం చేయడానికి సదస్సు తోడ్పడుతుందని తెలిపారు. 'మన్ కీ బాత్'లో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగించారు. ాూసదస్సుకు ప్రపంచ దేశాల అధినేతలు, పారిశ్రామిక వర్గాలు, సీఈఓలు, ఐఏ స్టార్టప్ రంగం ప్రతినిధులు, నవీన ఆవిష్కర్తలు హాజరయ్యారని గుర్తుచేశారు. "సదస్సులో ప్రధానంగా రెండు అంశాలు దేశాధినేతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారు అమూల్ పాల కేంద్రాన్ని సందర్శించారు. రైతులు తమ పాడి పశువులను ఏఐ టెక్నాలజీతో నిరంతరం గమనించే తీరు పరిశీలించామన్నా రు. మన ప్రాచీన గ్రంథాలు, విజ్ఞానం, రాతప్రతులను ఏఐ టెక్నాలజీతో పరిరక్షిస్తున్న తీరు, వాటిని నేటి తరానికి అందిస్తున్న వైనాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. సదస్సులో మూడు 'మేడిన్ ఇండియా' ఏఐ మోడల్స్ విడుదల చేశాం" అని వివరించారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు. "ప్రధానంగా వృద్ధులు ఈ మోసాల బారిన పడుతుండటం ఆందోళనకరం. బ్యాంకుల కేవైసీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలి" అన్నారు.

## జమ్మూలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు టెర్రరిస్టులు హతం

అయితే దేశంలోకి ఉగ్రవాదుల ప్రవేశాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని అధికారులు అన్నారు. వేట కొనసాగుతుందని శాంతికి భంగం కలిగించే వారికి ఎట్టిపరిస్థితుల్లో భారత్‌లో ఆశ్రయం దొరకదని ఆర్మీ అధికారులు తెలిపారు. కాగా ఇటీవల జమ్మూకశ్మీర్ ప్రాంతంలో భద్రతా బలగాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లో సరిహద్దులోకి ప్రవేశించకుండా ఆధునాతన డ్రోన్లు నిఘా కెమెరాలతో పహారా కాస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముగ్గురు ముష్కరులను భద్రతా బలగాలు కాల్చి చంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ జమ్మూ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు ఆరుగురు టెర్రరిస్టులు హతమైనట్లు అధికారులు తెలిపారు.

## ఉద్రిక్తంగా 'చలో కామారెడ్డి'

లాలాపేట: బీజేపీ రాష్ట్ర నాయుకత్వం పిలుపు మేరకు ఆదివారం తలపెట్టిన చలో కామారెడ్డి ఉద్రిక్తంగా మారింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ఉద్రిక్త వాుతావరణం నెలకొంది. శనివారం రాత్రి నుంచే వారి ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు. బీజేపీ నాయకత్వాన్ని కామారెడ్డికి వెళ్లకుండా అడుగడుగునా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాత్రి నుంచి హౌస్ అరెస్టులో ఉన్న రాంచందర్‌రావు ఎలాగైనా సరే కామారెడ్డి పర్యటనకు వెళ్లాల్సిందేనంటూ ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు రాంచందర్‌రావును అడ్డుకున్నారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తార్నాకకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, బీజేపీ శ్రేణుల తోపులాటల మధ్య రాంచందర్‌రావుతోపాటు మరికొందరిని అరెస్టు చేసి బొల్లారం, గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లకు తరలించారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని ఎమ్మెల్సీ మల్క కొమరయ్యను, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేశారు. అదేవిధంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా హౌస్ అరెస్టు చేశారు. ఈ అరెస్టులపై పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేయడమేంటి? కాంగ్రెస్, ఎంఐఎం కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయి. ఈ రెండు పార్టీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం దుర్మార్గం. ఈ అరాచకాలను అడ్డుకోవడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధంకావాలి. కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే. బాన్సువాడలో 70 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారు. రాళ్ల దాడి స్పష్టంగా కన్పిస్తున్నా చర్యల్లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రను చేస్తోంది. నియంతృత్వంగా వ్యవహరించడంలో బీఆర్ఎస్ సర్కారును తలపిస్తోంది. రేవంత్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధ పాలన చేస్తోంది. సొంత పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపేందుకు బీజేపీ అధ్యక్షుడు వెళ్లడం నేరమా? బీజేపీని అణిచివేసే కుటిల ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది. అక్రమ అరెస్టులు చేసి, నిర్బంధించడం హేయమైన చర్య. రాంచందర్‌రావు అరెస్ట్ అప్రజాస్వామికం. కేసీఆర్ ప్రభుత్వంలో హౌస్ అరెస్టుల తీరు ఇప్పుడు పునరావృతమైనట్లు కనిపిస్తోంది. నాడు కేసీఆర్ ఇదే తరహా హౌస్ అరెస్టులు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేయగా.. నేడు రేవంత్‌రెడ్డి అదే పాటిస్తున్నారు. అధికార పార్టీ నేతలే గూండాయిజం చేస్తున్నారు.అరెస్ట్‌కు ముందు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాంలో విపక్ష నేతలను ఇష్టానుసారంగా అరెస్టు చేసి గొంతు నొక్కిన 1975 ఎమర్జెన్సీ చీకటి రోజులను గుర్తుచేసిందని మండిపడ్డారు. కామారెడ్డి, బాన్సువాడ ఘటనల అనంతరం ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేశారని దుయ్యబట్టారు. బీజేపీ నేతల హౌస్ అరెస్టు కక్షసాధింపే. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ఖూనీ చేస్తోంది. అధికారాన్ని దుర్వినియోగం చేసి అరెస్టులకు దిగడం దౌర్భాగ్యకరం. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటును కాంగ్రెస్ నాయకులు కారుతో గుద్ది ధ్వంసం చేయడం.. రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి ఉదాహరణ. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టు చేయడం చూస్తుంటే.. రాష్ట్రంలో అప్రకటిత అత్యవసర పరిస్థితిని తలపిస్తోంది. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి భయపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారాన్ని ప్రతీకార రాజకీయాలకు వాడుకుంటోంది.

## హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ వివాదాలు ఉండేవి కావని సీఎం చురకలంటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి, ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. "కాళేశ్వరం వారి సొంత ఆస్తి కాదు. అది ప్రజల డబ్బు. దాన్ని వృథాగా పోనివ్వం. తిరిగి వినియోగంలోకి తెస్తాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. నిధుల కొరత ఉన్నప్పటికీ, రెండేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 6,000 కోట్ల నుంచి రూ. 18,500 కోట్లకు పెరిగిందన్నారు. భూసేకరణ కోసం జూన్ 2 లోగా రూ. 600 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, గ్రీన్ ఛానల్ ద్వారా పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## లొంగిపోయిన దేవ్‌జీ!

ఇదే విషయాన్ని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ్‌శర్మ ఆదివారం రాయ్‌పూర్‌లో మీడియా సమావేశంలో వెల్లడించారు. దేవ్‌జీ, సంగ్రామ్ లొంగిపోయినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అయితే ఈ వార్తలను తెలంగాణ పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, దేవ్‌జీ లొంగుబాటు వార్తల నేపథ్యంలో కేంద్రం సాగిస్తున్న ఆపరేషన్ కగార్2 లక్ష్యం ఇక నెరవేరినట్లేనన్న చర్చ నడుస్తోంది. తిప్పిరి తిరుపతి స్వస్థలం జగిత్యాల జిల్లా కోరుట్ల కాగా, రాజిరెడ్డి పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందినవారు. 'కేంద్ర హోంమంత్రి అమిత్ షా రణనీతి, ఛత్తీస్‌గఢ్ సీఎం అవలంబించిన విధానాల కారణంగా మావోయిస్టు పార్టీ మనుగడ అంతిమ దశకు చేరుకుంది. దేవ్‌జీ, సంగ్రామ్‌లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి, అబూజ్‌మడ్ అడవుల్లో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరు అగ్రనేతల లొంగుబాటు మా ప్రభుత్వానికి భారీ విజయం. కానీ వారిద్దరి కంటే మరో సీనియర్ నేత (ముప్పాళ్ల లక్మణరావు) ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. అయితే ఆయన వయోభారంతో ఉన్నారు. ఆయన ఎక్కడ ఉన్నారనే అంశంపై మాకు స్పష్టత లేదు. అగ్ర నాయకత్వంలో మరో నేత (మిసిర్ బెహ్రా) జార్ఖండ్‌లో ఉన్నారు. అజ్ఞాతంలో ఉన్న ఇంకొందరు సాయుధ మావోయిస్టుల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కర్రెగుట్టల్లో భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్‌తో మాకు సత్ఫలితాలు వస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన 89 ఐఈడీలను నిర్వీర్యం చేశాం. మారిన పరిస్థితులను గుర్తించి మిగిలిన వారు కూడా లొంగిపోతే మంచిది. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తాం'అని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ చెప్పారు. తిరుపతి లొంగుబాటు వార్త తెలియగానే ఆయన సోదరుడు గంగాధర్, ఆయన కుమార్తె సుమ, ఇతర బంధువులు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. 'ఏళ్ల తరబడి అడవుల్లో ఉండి అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసిన ఆయన.. మా కోసం ఉద్యమాన్ని వీడి లొంగిపోయి వస్తున్నారన్న విషయం తెలియడంతో మా కల నిజమైందని సంబరపడుతున్నాం'అని సుమ చెప్పారు.

## స్నేహితుడే సూత్రధారి!

రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసు మిస్టరీని తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీల విషయంలో తేడాలు రావడంతో ఆయన స్నేహితుడే కిరాయి హంతకులతో ఈ దారుణానికి పాల్పడినట్టు తేల్చారు. ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంతో ఉన్న కారును జలాశయంలోకి తోసేసినట్టు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి శ్రీనివాస్ స్నేహితుడితో పాటు మరో ముగ్గురు కిరాయి హంతకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయంలో ఫిబ్రవరి 14న ఓ కారు పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి బయటకు దూకి పారిపోయినట్టు అక్కడి మత్స్యకారులు తెలిపారు. కారును బయటకు తీసి చూడగా, అందులో శ్రీనివాస్ (48) మృతదేహం లభించింది. ఆయన తలపై గాయాలు ఉండటంతో పోలీసులు అనుమానించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా అల్లూరు గ్రామ వాసిగా గుర్తించారు. 2014లో 'పవన్ కల్యాణ్ హఠావో–పాలిటిక్స్ బచావో' అనే పుస్తకం ప్రచురించిన తర్వాత శ్రీనివాస్ వార్తల్లోకి ఎక్కారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఇది హత్యేనని అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. వారం రోజుల్లోనే కేసులో పురోగతి సాధించి, శ్రీనివాస్ స్నేహితుడు వేణుమాధవరెడ్డితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పి. కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, అజ్మత్ అలీ అనే ముగ్గురు కిరాయి హంతకులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, కొన్ని లావాదేవీల కోసం తన జీఎస్టీ ఖాతాను వాడుకునేందుకు శ్రీనివాస్... మాధవరెడ్డికి అనుమతి ఇచ్చారు. అయితే, జీఎస్టీ బకాయిల విషయంలో అధికారుల నుంచి శ్రీనివాస్‌కు నోటీసులు రావడంతో, ఒప్పందం ప్రకారం ఆ డబ్బు చెల్లించాలని మాధవరెడ్డిపై శ్రీనివాస్ ఒత్తిడి పెంచారు. దీంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని మాధవరెడ్డి నిర్ణయించుకుని, కిరాయి హంతకులను రంగంలోకి దించాడు. విజయవాడ వెళుతున్న శ్రీనివాస్‌ను నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి వద్ద కారులోనే హత్య చేశారు. ఆ తర్వాత నేరాన్ని కప్పిపుచ్చేందుకు మృతదేహంతో సహా కారును పాలేరు జలాశయంలోకి తోసేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు.

# విశ్వ భారతి లా కాలేజీలో ఘనంగా గ్రాడ్యుయేషన్‌లి డే...

## న్యాయవాదులు సేవాభావంతో పనిచేయాలి... ఓయూ లా డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వరులు...




శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :నేటి ఆధునిక కాలంలో ఎదురవుతున్న సవాళ్లను, ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏ ఐ) వంటి సాంకేతిక మార్పులను తట్టుకుని నిలబడేలా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఓయూ లా కాలేజ్ డీన్, హెచ్ఓడీ ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వరులు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని విశ్వ భారతి కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వరులు మాట్లాడుతూ.. న్యాయవాదులు క్లయింట్ల పట్ల గౌరవంతో మెలగాలని, వారి సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. న్యాయ వృత్తిలో రాణించాలంటే నిరంతర అధ్యయనం అవసరమని, రోజుకు 18 గంటల పాటు కష్టపడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వృత్తిని కేవలం ధనార్జన కోసం కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సేవ చేయాలని ఆయన హితవు పలికారు. 2022--2025 విద్యా సంవత్సరంలో న్యాయవిద్య పూర్తి చేసిన 150 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంలో పట్టాలను అందజేశారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ డా. విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కెరీర్‌ను అభివృద్ధి చేసుకుంటూనే సమాజానికి సేవ చేయాలని, తద్వారా విద్యాసంస్థల గౌరవాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "అనంత రాజమ్మ స్మారక అవార్డులను" అందజేశారు.

**శృతి మండా:** గోల్డ్ మెడల్ (బంగారు పతకం).

**శైలజ కొండాపురం:** సిల్వర్ మెడల్ (వెండి పతకం).

కళాశాల కరస్పాండెంట్ రవి అనంత, ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని సమక్షంలో విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ వేడుకలో అధ్యాపకులు గురుమూర్తి, తేజశ్రీ, కీర్తి, రమ్యశ్రీతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.



## బద్రి గాలయ్యను సన్మానించిన ఆకుల ఇంద్రసేనారెడ్డి

**చౌటుప్పల్.ఫిబ్రవరి 22. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం 8వ వార్డు కార్యాలయంలో ఆదివారం కౌన్సిలర్ గా బాధ్యతలు చేపట్టిన బద్రి గాలయ్య ను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ...పార్టీలకు అతీతంగా 8వ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని, నిత్యం ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజాభిమానాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్,మాజీ సర్పంచ్ లు పాశం సంజయ్ బాబు,కానుగు యాదమ్మ బాలరాజు, పాశం భీమయ్య,జిల్లా నాయకులు గుండెబోయిన రవికుమార్,వార్డ్ అధ్యక్షులు పాశం శ్రీనివాస్,నాయకులు పాశం కృష్ణ,ఆకుల యాదిరెడ్డి,వెంకటేష్ మహాజన్,దేశట్ల బిక్షం,బద్రి బాలరాజ్, గుండె బోయిన నరసింహ యాదవ్,దొమ్మటి దయాకర్ రెడ్డి,పాలెం సుమన్, కడుపు నరసింహ,కరీం సయ్యద్,కడుపు ఉపేందర్,గ్రామ పెద్దలు, నాయకులు, యువజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ జెట్ట నిరజా సిద్దులు, జూకంటి సంపత్ కు ఘనంగా సన్మానం......

**ఆలేరు ఫిబ్రవరి 22 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపల్ కౌన్సిలర్ గా 12వ వార్డు జెట్ట నిరజా సిద్దులు, 11వ వార్డు జూకంటి సంపత్ గెలుపొందిన సందర్భంగా ఆలేరు కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన వార్డు ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు వార్డులను ఎమ్మెల్యే బిర్లా ఐలయ్య సహకారంతో అభివృద్ధి దిశలో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు. వార్డులో ఎలాంటి సమస్య ఉన్న మా దృష్టికి తీసుకురావాలని కోరారు. మా వంతు కృషి చేస్తామని తెలిపారు.



## హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం విరాళం అందించిన కుతుభోద్దీన్



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 22:** మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన మండల మైనారిటీ నాయకుడు మాజీ ఉప సర్పంచ్.ప్రస్తుత 9వ.వార్డు సభ్యుడు కుతుబొద్దీన్ (మేరాజ్) గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ మానస రవీందర్ గౌడ్ సమక్షంలో నూతన హనుమాన్ మందిరం నిర్మాణం కోసం గ్రామస్తులు విరాళాలు సేకరిస్తుండగా గ్రామానికి చెందిన మీరాజ్ తన వంతుగా భాగస్వామి అయ్యి ఆదివారం నాడు తన సొంత నిధుల నుండి 5016 రూపాయలు ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, కులమతాలకు అతీతంగా.ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన వంతుగా సహకారం అందించడం జరిగిందని, ఈసందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. బిఆర్ఎస్ నాయకులు. చెక్క రవీందర్ గౌడ్. మహమ్మద్ రఫీ ఉద్దీన్. పండుగ శేఖర్. బోరపట్ల క్రిష్టయ్య. తదితరులు పాల్గొన్నారు.

## సందర్శకులను ఆకట్టుకుంటున్న ఖాదీ చేనేత ఉత్పత్తులు....



**హైటెక్ సిటీ ప్రభాత సూర్య :** శిల్పారామం మాదాపూర్ లో నిర్వహిస్తున్న ఖాదీ మహోత్సవ 2026 లో ఏర్పాటు చేసిన ఖాదీ , చేనేత ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నవీ ఆదివారం రుచిక కథక్ డాన్స్ అకాడమీ , జపాన్ లో ఉన్న సంస్థ నుండి జపనీస్ కళాకారులను నారా జపాన్ హబ్ వారు కథక్ ప్రదర్శన ఏర్పాటు చేసారు. నళిని తోష్నివాల్ , నాయకో ఇవాసకి, మన నాకత , యోషిమి కావకామి ,రీ నాగై , అమీషా తోష్నివాల్ ,పాల్గొన్నారు. పార్కుకి స్కూల్ అఫ్ డాన్స్ డాక్టర్ సాయి జీవన గారి శిష్య బృంద కథక్ నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. తుమ్రి, తీన్తాల్, పుష్పాంజలి, గణేష్ వందన, శివపంచాక్షరీ స్తోత్రం, శివ తాండవం, అష్టపది, అంశాలను ప్రియా, చంద్రలేఖ, శాన్వి, అలేఖ్య, అక్షిత, మానస, సిరి, అక్షత, జీవన మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షణ చేస్తున్న కౌన్సిలర్ జూకంటి సంపత్......

**ఆలేరు ఫిబ్రవరి 22 ప్రభాత సూర్య.** ఆలేరు 11వ వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్ వార్డులో తిరుగుతూ ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. పారిశుద్ధ్య పనులను ఆదివారం రోజున ఉదయం స్వయంగా పర్యవేక్షించారు. పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురికి కాల్వలో పేరుకుపోయిన చెత్త చెదారంను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇళ్లల్లోని చెత్తను వీధులలో రోడ్డు మధ్యన, మోరీలలో వెయ్యరాదని సూచించారు. ప్రతిరోజు మీ ఇంటికి వద్దకు చెత్త సేకరణ చేసే వాహనాలతో వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని తెలిపారు. వీధులు శుభ్రంగా ఉంటే అంటూ రోగాలు రాకుండా ఉంటాయని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. 11వ వార్డు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ ఫిబ్రవరి 21:- (ప్రభాత సూర్య ) ఈ నెల 23న సోమవారం మిర్యాలగూడ నియోజకవర్గం స్థాయి శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా జరగనున్న బంజారా సోదర సోదరీమణులు ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేవలాల్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన బంజారాలు అత్యంత వైభవంగా జరుపుకునే సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జయంతి రోజున మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుండి సంత్ సేవాలాల్ భవనం ఎన్ఎస్పి క్యాంప్ వరకు గిరిజన సంప్రదాయ వేషధారణ డప్పు వాయిద్యాలతో ఆటపాటల ద్వారా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాభోగ్ బండారో కార్యక్రమం నిర్వహిస్తున్నమని చెప్పారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సంత సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు అధికారులు అనధికారులు, విద్యావంతులు మహిళలు కుల సంఘాలు విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించడం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొర్రనాగునాయక్, రవితేజ నాయక్, సర్పంచులు సిద్దు నాయక్, శ్రీహరి, మండల విద్యాధికారి ధర్మానాయక్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ నాయక్, కృష్ణకాంత్ నాయక్, కృష్ణానాయక్, మురళినాయక్ పాల్గొన్నారు.




## గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ జయంతి

**మిర్యాలగూడ , ఫిబ్రవరి 22:-( ప్రభాత సూర్య):** గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవలాల్ మహారాజ్ 287వ జయంతిని ఆదివారం మిర్యాలగూడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకుల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్, 6వ వార్డు ఇంద్రమ్మ కాలనీ కౌన్సిలర్ అశోక్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నాగు నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి కోటి, సోషల్ మీడియా ఇన్చార్జి శరత్ లు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ డైమండ్ చెస్ అకాడమీ క్రీడాకారుడు రెళ్ళ లోకేష్ 60 చెస్ బోర్డులను 24 నిమిషాలలో విజయం సాధించి వరల్డ్ రికార్డ్

## లోకేష్ కు గోల్డ్ మెడల్ బహూకరించిన డైమండ్ శ్రీనివాస్







**మిర్యాలగూడ , ఫిబ్రవరి 22:- (ప్రభాత సూర్య):** ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ డిస్టిక్ట్ వి 104 ఏ రీజియన్ 10 ఆధ్వర్యంలో మిర్యాలగూడ డైమండ్ చెస్ అకాడమీ రెళ్ళ లోకేష్ చెస్ క్రీడల్లో వరల్డ్ రికార్డ్ సృష్టించారు. హైదరాబాద్ నగరంలో దుండిగల్ ఆశ్రమంలో నిర్వహించిన చెస్ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండల కేంద్రానికి చెందిన రెళ్ళ కిరణ్ కుమార్ భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు 12 సంవత్సరాల లోకేష్60 బోర్డులను 24 నిమిషాలలో చదరంగంలో విజయం సాధించి వరల్డ్ రికార్డు సృష్టించాడు. టోర్నమెంట్ ముఖ్యఅతిథి నారాయణరావు, ఆత్మీయ అతిథులు కార్పోరేటర్ సుధాకర్, రామచంద్ర గౌడ్ లు చదరంగంలో వరల్డ్ రికార్డు సృష్టించిన లోకేష్ తల్లిదండ్రులను అభినందించారు. లోకేష్ కు డైమండ్ చెస్ అకాడమీ ఫౌండర్ మాశెట్టి దివ్యశ్రీ, కో ఫౌండర్ అంకిత కప్ విజేత కప్ అందజేయగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, లోకేష్ ను శాలువాతో ఘనంగా సత్కరించి గోల్డ్ మెడల్ ను అందజేశారు. కార్యక్రమంలో అఖిల శ్రీరామ్, కొత్తూరి వేణుగోపాల్, అనిత, బాలమణి, మాశెట్టి రమేష్, లక్ష్మి పార్వతి, బొడ్డు జయశ్రీ పాల్గొన్నారు. అదేవిధంగా లోకేష్ ను వాసవి క్లబ్ 10 ఆర్సి ఓరుగంటి శ్యాంసుందర్, డిస్టిక్ ఇన్చార్జి సామా శ్రీనివాస్, నకిరేకంటి సత్యనారాయణ, ఆర్ఎస్ గట్టు వెంకటేశ్వర్లు, ఆర్ఇసి సోమ వెంకటేశ్వర్లు, జోన్ చైర్ పర్సన్ పాంపాటి రామలింగయ్య, ఈగ సైదారావు, రీజియన్ పిఎస్టి టీం అభినందనలు తెలిపారు.



## కౌన్సిలర్లు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలి

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 22:-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ పట్టణంలోని యాదవ సంఘ భవనం పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు కట్టబోన శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన మిర్యాలగూడ పురపాలక సంఘం ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన యాదవ కౌన్సిలర్లకు సన్మానించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు యాదవ సంఘం రాష్ట్ర నాయకులు సర్నాల వెంకన్న, బట్టు రమాదేవి వెంకట్, గుడిపాటి కోటయ్య యాదవ్ లు మాట్లాడుతూ నేడు విజయం సాధించిన యువ కౌన్సిలర్ లు యాదవ సంఘానికి, బహుజన సమాజానికి సేవ చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి ప్రజల మనసును చూరగొనాలని అప్పుడే సమాజానికి సేవ చేసిన వాళ్ళు అవుతారని అలాగే యాదవ సంఘం బలోపేతానికి, భవన నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. కౌన్సిలర్లు గంగుల బిక్షం యాదవ్, పుట్టపాక శ్రీనివాస్ యాదవ్, పొదిల నిక్షిత్ యాదవ్ లను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వెంకట్ యాదవ్, రాయినిపాలెం సర్పంచ్ చిలుకల మురళి నల్లగొండ జిల్లా సాంస్కృతిక కార్య కార్యదర్శి దారం మల్లేష్ యాదవ్, వార్త జంగా లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు మెండె సైదయ్య, యాదవ ఉద్యోగుల సంఘం బాధ్యులు డొంకల వెంకటేశ్వర్లు, గొట్టే నాగేంద్ర, చిర్ర మల్లయ్య, చల్లా రవికుమార్, కోటయ్య, కుర్ర లింగరాజు, నాగేందర్, సాయి పాల్గొన్నారు

## శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి డా. ఆర్ఎస్ఎస్ సహాయం



**పులివెందుల, ఫిబ్రవరి 22(ప్రభాత సూర్య ):** పులివెందుల పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత మరియు భక్తుల సౌకర్యం దృష్ట్యా అవసరమైన పనిముట్లు, త్రాగునీటి డ్రమ్ములను డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితరణగా అందజేశారు.ఈ సందర్భంగా స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ఎస్ మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణంలో పెరిగే పిచ్చి మొక్కలు, గడ్డి, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన వివిధ రకాల పనిముట్లు అందించామని తెలిపారు. అలాగే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు త్రాగునీటి డ్రమ్ములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ రంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం రంగనాయకులు, ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈవో వెంకటరమణ, శ్రీ సాయి చైతన్య జూనియర్ మరియు డిగ్రీ కళాశాల అధినేత నారాయణరెడ్డి, గుప్త మెడికల్ అధినేత దినేష్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్ శర్మ, డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ సభ్యులు సరస్వతి, ప్రణీత్ కుమార్, మొహమ్మద్, సుబ్బరాయుడు మరియు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలో వాసవి క్లినిక్ ను ప్రారంభించిన సాధు ప్రతాప్ రెడ్డి



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 22 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన వాసవి క్లినిక్ ను కాలనీ అధ్యక్షులు సాధు ప్రతాప్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఆరోగ్య సేవల విస్తరణకు ఇది కీలక అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్లినిక్‌లో జనరల్ ఫిజీషియన్‌గా డా. ఎ.హరితేజ, హోమియోపతి వైద్యురాలిగా డా. జె.గౌతమి సేవలు అందించనున్నారు. కాలనీ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని నిర్మించి ముందుకు వచ్చిన వైద్యులను కాలనీ అధ్యక్షులు ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో కాలనీ వాసులు ఇకపై దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఆయన తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ చంద్రరెడ్డి, బలునాయక్, జనరల్ సెక్రటరీ రామరాజు, ట్రెజరర్ ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ సిద్ధ రెడ్డి, తదితర కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. ఈకార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది. స్థానిక ప్రజలు కూడా క్లినిక్ ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సేవలను సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. కాలనీ అభివృద్ధి దిశగా ఇది మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## రజక కులానికి చెందిన పసిపాప మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

### బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్




**ప్రభాత సూర్య (ఫిబ్రవరి 22)మాడుగుల పల్లి మండలప్రతినిధి :**నాగర్ కర్నూలు జిల్లాలో కమ్మెర గ్రామంలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన రజక చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకొని దాడి చేసి,రెండు నెలల పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ డిమాండ్ చేశారు.స్థానిక మిర్యాలగూడ పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద బీసీ జేఏసీ మరియు రజక సంఘాల ఆధ్వర్యంలో డాడీ మరియు పసిపాప మృతికి కారణమైన వారిని శిక్షించాలని స్తూపం వద్ద నిరసన చేయడం జరిగింది వారు మాట్లాడుతూ రజక కులానికి చంద్రకళ అతని కుమారుడు గణేశ్ మల్లన్న దేవుని దర్శనానికి వెళుతుండగా కొంతమంది అగ్రకులాల వారు అడ్డుకొని చాకలి చంద్రకళ మరియు ఆమె కొడుకు గణేష్ కోడల్ని కూతురుని బూతులు తిడుతూ దారుణంగా కొట్టడమే కాకుండా రెండు నెలల పసిపాప ఉందని కూడా కనికరం లేకుండా వారి మీద దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతతో రెండు నెలల పసిపాప మృతి చెందిందని వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి. అలాగే వారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు, దోషులకు శిక్ష పడే దాక బీసీ జేఏసీ మరియు రజక సంఘాల పోరాటం ఆగదన్నారు ఈ కార్యక్రమంలో ::బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్యరజక, బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు కుమ్మరికుంట్ల సుధాకర్ రజక,బీసీ యువజన నాయకులు ఎస్ పి నాయుడు, తుపాకుల తుకరం, వెంకన్న, సైదులు, నారాయణ బాలరాజు, యాదగిరి, దోమలపల్లి నవీన్, రాంగౌడ్, శ్రీనివాస్, లవంకుమార్, స్వాతి, లావణ్య, త్రివేణి, పార్వతి,, గాయత్రీ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు



## జగిత్యాల జిల్లాలో అనుమానాస్పద స్థితిలో కాలువలో శవమై తేలిన బీజేపీ నాయకుడు

**జిల్లాలోని పెగడపల్లి మండలం సుద్దపల్లిలో విషాదం**

**ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయిన రమణారెడ్డి**

**ప్రమాదమా లేక హత్యనా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లిలో బీజేపీ నాయకుడు రమణారెడ్డి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. గతంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పని చేశారు. మూడు రోజుల క్రితం ఆయనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.రమణారెడ్డి ప్రయాణిస్తున్న బ్రెజ్జా కారు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఆయన మృతి చెందాడు. ఆయన ఇటీవల క్రిప్టో కరెన్సీతో భారీగా నష్టపోయాడు. మూడు రోజులుగా ఆయన కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయన కారును ఎస్సారెస్పీ కాలువలో గుర్తించి వెలికి తీయగా అందులో రమణారెడ్డి మృతదేహాన్ని ఉంది. ప్రమాదవశాత్తు కారు అందులో పడిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఆయన 18వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా ఈ ప్రాంతాన్ని దాటి అతను బయటకు వెళ్లినట్లుగా ఎక్కడా లేదన్నారు.

## మల్లఖంబ్ లో ట్రినీటి విద్యార్థులకు కాంస్య పథకాలు

### రాష్ట్రస్థాయిలో మూడో స్థానం...

**చౌటుప్పల్.ఫిబ్రవరి 22. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్ విద్యార్థులు శుక్ర,శని వారాలలో హైదరాబాద్ సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ 2026 -సెకండ్ ఎడిషన్ లో జరుగుతున్న మల్లఖంబ్ స్టేట్ కాంపిటేషన్ క్రీడలో ట్రినిటీ హై స్కూల్ విద్యార్థులు కత్తి అక్షిత, గణేష్ లు పాల్గొని రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించి కాంస్య పథకాలు గెలుచుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల తెలిపారు.ఈ పోటీలలో 16 జిల్లాల నుంచి మల్కంబు క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు.ఈ పోటీలలో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ట్రినిటీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో కాంస్య పథకాలు గెలుచుకోవడం సంతోషదాయకమన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పథకాలను విద్యార్థులు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కెవిబి కృష్ణారావు, స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన పీఈటీ లు కిరణ్ కుమార్, గోపాల్, హారతిలను ప్రిన్సిపాల్, చైర్మన్లు అభినందించారు.










# కండ్లు రెండు మంచిగయ్యేంతవరకు చూయించుకోండి

**నెలకొకసారి కంటి శిబిరం పెడతాం**

**ధైర్యంగా ఆపరేషన్లకు వెళ్లి రండి అంటూ మహిళలకు భరోసా**

**12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**మునుగోడు, ఫిబ్రవరి 22( ప్రభాత సూర్య):** తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడే ప్రతి ఒక్కరికి కంటి చూపు మెరుగవ్వాలనే తలంపుతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తోంది.. ఆదివారం మునుగోడు లోని క్యాంపు కార్యాలయం వద్ద చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డుల ప్రజలతోపాటు, చండూరు మండలంలోని 19 గ్రామాల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.. ఈ వైద్య శిబిరాన్ని చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథలతోపాటు చండూరు మున్సిపాలిటీ మండల నాయకులతో ప్రారంభింపచేశారు మునుగో డు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించి ఎవరెవరికి ఏ ఏ కంటి సమస్యలు ఉన్నాయని ఆరా తీసి మీకు నేనున్నానని భరోసా ఇచ్చారు... ఈ 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 610 మంది కి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో , 250 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు... కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిలో 155 మంది ని వెంటనే ఆపరేషన్ల కొరకు హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని మంగళవారం రోజు తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తారు.. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి మీకు నేనున్నానని ధైర్యంగా వెళ్లి ఆపరేషన్లు చేయించుకుని రండని భరోసా ఇచ్చారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ... మీ రెండు కళ్ళు మంచిగా అయ్యేంతవరకు చూయించుకోండని మీకోసం ప్రతి నెల ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని మరోసారి స్పష్టం చేశారు...ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలను ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రుల వారి సౌజన్యంతో తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు...

# కనుమరుగు కాకుండా కుమ్మరి వృత్తిని కాపాడతా: ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ, ఫిబ్రవరి 22:- (ప్రభాత సూర్య):** కనుమరుగు కాకుండా కుమ్మరి వృత్తిని కాపాడుతానని, నైపుణ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జ్ జమ్మిశెట్టి వేణుగోపాల్, కమిటీ సభ్యులు కమిశెట్టి శ్రీనివాస్, కామిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో సమావేశం నిర్వహించారు. నేరేడుచర్ల మునిసిపల్ కౌన్సిలర్ గా గెలుపొందిన జనసేన పార్టీ అభ్యర్థి కుమ్మర ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు దంపతులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సన్మానించారు. ముఖ్యఅతిథి స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్ కుమ్మరి సంఘం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి స్థానిక నాయకులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మనిషికి నాగరికత నేర్పిన కుమ్మరి వృత్తి అని ఆ వృత్తి కనుమరుగై పోవడం చాలా బాధాకర విషయమని వృత్తిని కాపాడటానికి నియోజకవర్గంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. త్వరలోనే మిర్యాలగూడ సబ్ కలెక్టర్ తో మాట్లాడి కుమ్మరి కులస్తుల ప్రధాన డిమాండ్ కుండల తయారీ నైపుణ్య కేంద్రం స్థలం ఇచ్చి యువతకి ప్రోత్సాహం అందిస్తానని విషయం సబ్ కలెక్టర్ తో మాట్లాడి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.. మిర్యాలగూడ నియోజకవర్గంలో కుమ్మరి కులంలో ఎవరైనా ఇల్లు లేని వాళ్ళు ఉంటే ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని లేనివారి సమాచారం కుల సంఘ నాయకులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండలు వెంకటేశ్వర్లు, జిల్లా సంఘ నాయకులు గంగాధరి వెంకటేశ్వర్లు, నిమ్మనగోటి శ్యాంప్రసాద్, నల్గొండ కామిశెట్టి శ్రీనివాస్, మిర్యాలగూడ నియోజకవర్గ నాయకులు కామిశెట్టి రామకృష్ణ, నీలకంఠం భాస్కర్, నాదెండ్ల అయ్యన్న , దమ్మలపాటి పుల్లారావు , నార్ల కంటి నరసింహ, కుందనపల్లి బాలకృష్ణ, నాంపల్లి సైదులు, కంచర్ల సైదయ్య, ధూపాటి హరికృష్ణ , వడ్లపల్లి లాలయ్య పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి..





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 22 :** హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలోనీ కొన్యాల మౌనిక నరేందర్ ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా మంజూరు అయినా ఇల్లు కావడంతో వారు ఇంటిని నిర్మించుకున్న సందర్భంగా గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇల్లు లేని పేదలకు తమ చిరకాల ఇంటి కలలను నెరవేర్చిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని ఆయన కొనియాడారు. ప్రజా పాలన పేరుతో ప్రజలకు చేరువైన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ప్రతి ఇంటికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని ప్రజలను వంచించి మోసం చేశారని ఆయన ఎద్దేవ చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే రేవంత్ రెడ్డి గవర్నమెంట్ నిజమైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువై నేడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోయేలా పథకాలను తీసుకువచ్చి ప్రజలకు చేరువయ్యారని తెలిపారు. అందుకే ప్రజలు గ్రామపంచాయతీ ఎన్నికల్లో గాని, మునిసిపాలిటీ ఎన్నికల్లో గాని కాంగ్రెస్ పార్టీని ఆదరించి ముందు వరుసలో నిలిపారని తెలిపారు. కాంగ్రెస్ పాలన అంటే ప్రజ పాలన అని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజలతో ఉండే ప్రజాపాలనా అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రే కృష్ణ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మణిదీప్, వార్డ్ మెంబర్లు మహమ్మద్ గౌస్ పాషా, ఖజామియా, అజీస్, రాజు, జోగయ్య, తదితరులు పాల్గొన్నారు,



# 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాకినేని యాక నారాయణ(వినోద్)**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 22 (ప్రభాత సూర్య) :** 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాకినేని యాక నారాయణ (వినోద్) అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ఆదేశాల మేరకు వసంత నగర్ డివిజన్ పరిధిలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాకినేని యాక నారాయణ (వినోద్), విజయలక్ష్మి ఆధ్వర్యంలో ధర్మారెడ్డి కాలనీ ఫేస్ టు శ్రీ గణపతి కళ్యాణ మండపంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి కాలనీ ఫేస్ టు, కాలనీ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, సెక్రటరీ దయాకర్ గుప్తా, ఈసీ మెంబర్ శివప్రసాద్, ప్రభు ప్రభు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కే హాస్పిటల్ పునర ప్రారంభం




**నల్గొండ ప్రభాత సూర్య :** నల్లగొండ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నెస్ట్ హాస్పిటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్కె హాస్పిటల్ ను రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పునరా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆధునిక వైద్య సదుపాయాలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు చేరువ కావడం ద్వారా ఆరోగ్య రంగం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి, డాక్టర్ కీర్తి రెడ్డిలు మాట్లాడారు స్థానిక ప్రజలకు మెరుగైన గ్యాస్ట్రాలజీ మరియు ఊపిరితిత్తులు వైద్య సేవలు అందించాలని ఆర్కే హాస్పిటల్ నిర్వాహకులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్యులు, సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల...

**చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు**

**చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలుగా మారారని షర్మిల విమర్శ**

**మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా**

**చంద్రబాబుది అధికారిక పొత్తు కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ**

**రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అంటూ కొత్త నిర్వచనం**

**రైతుల కోసం కాంగ్రెస్ నిరసన చేస్తుంటే ఉగ్రకోణం అంటారా అని ఫైర్**



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# అందుకే మాడలింగ్ వదిలేశా

మాడల్‌గా కెరీర్ మొదలుపెట్టి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అస్సాం బ్యూటీ కాయాదు లోహర్. 'డ్రాగన్' సినిమాతో ఒక్కసారిగా సెన్సెషన్ సృష్టించిన కాయాదు.. 'అల్లూరి' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. వరుస సినిమాలతో బిజీగా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా విశ్వక్‌సేన్ హీరోగా తెరకెక్కిన 'ఫంకీ'తో మరో హిట్ కొట్టింది. ఈ సందర్భంగా అస్సాం ఆసమ్ బ్యూటీ కాయాదు పంచుకున్న కబుర్లు ఇవి.. మాది అస్సాం. నేను అక్కడే పుట్టాను. మహారాష్ట్రలో పెరిగాను. ఎందుకో తెలియదు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఆసక్తి. ఆ క్రమంలో కొన్నాళ్లు మాడలింగ్ చేశాను. సినిమాల మీదే ఫోకస్ చేయాలని మాడలింగ్ వదిలిపెట్టాను.'కష్టపడాలి, చిత్తశుద్ధితో ఉండాలి, బాధ్యతగా వ్యవహరించాలి' నాకు తెలిసిన ఫార్ములా ఇదే! ఇండస్ట్రీలో పరిచయాలు లేకపోవడంతో ప్రతి ఆడిషన్‌లో నన్ను నేను నిరూపించుకోవాల్సి వచ్చేది. ఎంత కష్టపడ్డా ఫలితం రాకపోవడంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఫంకీ షూట్ మొత్తం ఫన్నీగా జరిగింది. డైరెక్టర్ అనుదీప్ చలాకీ మనిషి. నవ్వుతూనే యాక్షన్ చెప్పేస్తాడు. షాట్ ఒకే అవ్వగానే మళ్లీ నవ్విస్తాడు. విశ్వక్‌సేన్ కూడా మంచి వ్యక్తి. మొత్తంగా 'ఫంకీ' షూటింగ్ చాలా ఎంజాయ్ చేశా. తెలుగులో ఇది నా రెండో సినిమానే అయినా, భాష పరంగా పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటా. నాకు సంబంధించిన ఫొటోలు పోస్ట్ చేస్తుంటా. వాటివల్ల కొన్నిసార్లు ట్రోల్స్ కూడా ఎదుర్కొన్నాను. సోషల్ మీడియాలో పుట్టుకొచ్చే పుకార్లు, ట్రోల్స్ చూసినప్పుడు ఒక్కోసారి చిరాగ్గా అనిపిస్తుంది. కానీ, ఆ కామెంట్లకు నేను బాధపడటం ఏమిటని ఇగ్నోర్ చేస్తా. గతంలో కొన్ని సినిమాలు చేసినా డ్రాగన్ సినిమాతోనే మంచి గుర్తింపు వచ్చింది. ఆ సినిమా విజయం సాధించడంతో ప్రస్తుతం పది సినిమాలకు సైన్ చేశా. నాని నటిస్తున్న ప్యారడైజ్, సింబు హీరోగా వస్తున్న ఎస్‌టీఆర్-49 ఈ లిస్టులో ఉన్నాయి. వచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నది నా ఆలోచన. అందుకే ప్రతి కథలో నన్ను నేను ఊహించుకొని చేస్తున్నా. పారడైజ్‌లో కొత్తగా కనిపిస్తా. తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నా.







## హత్యలా? దైవ శిక్షా?.. ఓటీటీలోకి వచ్చిన భయానక క్రైమ్ థ్రిల్లర్

కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఇంటెన్స్ సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'రాక్షస' ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 (వవ5)లో ఫిబ్రవరి 20 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. క్రైమ్ థ్రిల్లర్ జానర్ ఇష్టపడే వారికి ఈ సిరీస్ ఒక ఆసక్తికరమైన ఎంపికగా నిలుస్తోంది. ఈ కథ ఉత్తర కర్ణాటకలోని మాలప్రభా నది ఒడ్డున, యెల్లమ్మ ఆలయ సమీప ప్రాంతంలో జరుగుతుంది. నది ఒడ్డున కుళ్లిపోయిన స్థితిలో కొన్ని శవాలు దొరకడంతో కథ మొదలవుతుంది. గ్రామస్తులంతా మొసలి దాడుల వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయని, అది ఒక దైవ శిక్ష అని నమ్ముతుంటారు. కానీ, సబ్-ఇన్‌స్పెక్టర్ హనుమప్ప (విజయ్ రాఘవేంద్ర) మాత్రం ఇవి సాధారణ మరణాలు కావని, పక్కా ప్రణాళికతో చేసిన హత్యలని అనుమానిస్తాడు. ఈ కేసును దర్యాప్తు చేసే క్రమంలో అతనికి స్థానిక మూఢనమ్మకాలు, వ్యక్తిగత జీవితంలోని సమస్యలు సవాళ్లుగా నిలుస్తాయి. ఈ హత్యల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించి, హంతకుడిని పట్టుకోవడమే లక్ష్యంగా హనుమప్ప సాగించే ప్రయాణం ఉత్కంఠ రేపుతుంది. ఈ సిరీస్‌లో మొత్తం 7 ఎపిసోడ్‌లు ఉండగా, ప్రతి ఎపిసోడ్ 20-25 నిమిషాల నిడివితో సాగుతుంది. అవినాష్, జహంగీర్ కీలక పాత్రలు పోషించారు. 2022లో వచ్చిన విజయవంతమైన తమిళ సిరీస్ 'విళంగు'కు ఇది అధికారిక కన్నడ రీమేక్ కావడం విశేషం.

## తమిళంలో బంపరాఫర్

తెలుగమ్మాయి శ్రీలీల అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటికే తెలుగులో అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న ఈ అందాలభామ.. 'పరాశక్తి' సినిమాతో తమిళచిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆ సినిమా ఫలితం ఎలాగున్నా.. శ్రీలీలకు తమిళనాట అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించనున్న చిత్రంలో శ్రీలీల కథానాయికగా ఎంపికైందనేది లేటెస్ట్ న్యూస్. ప్రస్తుతం తమిళ మీడియాలో ఈ వార్త బలంగానే వినిపిస్తున్నది. ఇక సినిమా విషయానికొస్తే.. 'ఊఖ64' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై టాలీవుడ్ అగ్ర నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. ఈ ఏడాది చివర్లో కానీ, సంక్రాంతి కానుకగా గానీ సినిమాను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు.





## యువతకు మృణాల్ ఠాకూర్ లవ్ సలహా

### ప్రేమ విషయంలో యువత ఓపికగా ఉండాలన్న మృణాల్ ఠాకూర్

'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్, ప్రేమ విషయంలో నేటి యువతకు ఓ ముఖ్యమైన సందేశం ఇచ్చారు. ప్రేమను కాపాడుకోవాలంటే ఓపిక చాలా అవసరమని, దానిపై సులభంగా నమ్మకం కోల్పోవద్దని ఆమె సూచించారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. "ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ప్రేమలో ఓపిక తగ్గిపోతోంది. అందుకే చాలామంది ఒకరినొకరు తేలిగ్గా వదులుకుంటున్నారు. మా సినిమాలో పాత్రల మాదిరిగా పాతకాలపు మనస్తత్వం ఉంటే బాగుంటుంది. చిన్న గొడవ వస్తే చాలు, వెంటనే ఒకరినొకరు బ్లాక్ చేసేస్తున్నారు. మా దారులు వేరు, మేం ఒకరికొకరం సెట్ కాము అని తేలిగ్గా చెప్పేసి సంబంధాలను వదులుకుంటున్నారు" అని అన్నారు. "ప్రతి యువతీ యువకుడు ప్రేమను నమ్మాలని కోరుకుంటున్నాను. దయచేసి ప్రేమపై నమ్మకం వదులుకోవద్దు. అది చాలా అందమైన, అద్భుతమైన అనుభూతి. సరైన వ్యక్తి మీ జీవితంలోకి వస్తే, జీవితం సులభంగా మారుతుంది. అందుకే సరైన వ్యక్తి కోసం ఓపికగా ఎదురుచూడండి. అంతేకానీ తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని యువతకు ఆమె సలహా ఇచ్చారు. ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్రంలో మృణాల్‌తో పాటు సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, ఆయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజయ్ లీలా భన్సాలీ, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుంది.





## 'కాక్ టెయిల్ 2'లో రష్మిక పాత్రపై వైరల్ న్యూస్

వరుస విజయాలతో దూసుకుపోతున్న రష్మిక మందన్న, ఇప్పుడు మరో ప్రయోగాత్మక పాత్రతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీగా భావిస్తున్న 'కాక్‌టెయిల్ 2'లో ఆమె పోషిస్తున్న పాత్ర గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ చిత్రంలో కృతి సనన్, రష్మిక మందన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ మీడియా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వీరిద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇదొక విభిన్నమైన ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని, రష్మిక-కృతి పాత్రల మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ జనవరి 31వ తేదీతో పూర్తయింది. 2012లో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె నటించిన సూపర్ హిట్ 'కాక్‌టెయిల్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వస్తోంది. ఈ సినిమాలో షాహిద్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపిస్తారని దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.